పత్రికాప్రకటన కాకినాడ/చొల్లంగి, 15.12.2018

కోరంగి పక్షుల ఉత్సవాన్ని యేటా రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలియజేశారు.

తాళ్లరేవు మండలం కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రంలో జిల్లా అటవీశాఖ, ఇగ్రీ ఫౌండేషన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న పక్షుల ఉత్సవంలో భాగంగా శనివారం జరిగిన వేడుకలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిధిగాను, అమలాపురం పార్లమెంట్ సభ్యులు డా.పండుల రవీంద్రబాబు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జడ్‌పి చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ విశిష్ట అతిధులుగాను హాజరైయ్యారు. కార్యక్రమంలో అతిధులు తొలుత పర్యాటక కేంద్రంలో ప్రకృతి సిద్ద ఉత్పత్తుల విక్రయానికి నూతనంగా ఏర్పాటు చేసిన నేచర్ షాప్‌ను ప్రారంభించి, పక్షుల ఉత్సవం సందర్భంగా వివిధ రకాల పక్షుల ఫోటోలు, సమాచారంతో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. అనంతరం జరిగిన సభలో ఉపముఖ్యమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ పర్యావరణ సమతౌల్యం, జీవావరణ పరిరక్షణతోనే మానవ జాతి మనుగడ ముడివడి ఉందన్నారు. జిల్లా తీరానికి సహజ రక్షణ కవచంగా నిలిచి, వలస వచ్చే ఏన్నో పక్షిజాతులకు ఆలవాలమైన కోరింగ మడ అడవులను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తూర్పు తీరంలో సుందరబాన్ అడవుల తరువాత 334 చకిమీ వైశాల్యంతో రెండవ అతి పెద్ద మడఅడవి మనజిల్లాలోనే ఉందన్నారు. ఈ మడఅడవిని జిల్లా తీరం వెంబడి మరింత విస్తరించడంతో పాటు, కోట్లాది మొక్కలు నాటే ఉద్యమాలతో జిల్లా అంతటా సామాజిక వనాల అభివృద్ధికి అటవీ శాఖ కృషి చేస్తోందన్నారు. గతంలో మడ అడవులను వంట చెరకు కొరకు ప్రజలు నరికి ధ్వసం చేసేవారని, 1996లో సంభవించిన పెనుతుఫాను విలయాన్ని ఈ అడవులు అడ్డుకుని రక్షణ కల్పించినపుడు వీటి ప్రాధాన్యత ప్రతి ఒక్కరికీ అవగతమైందన్నారు. అభయారణ్యంగా ప్రకటించిన తరువాత మడఅడవులు తిరిగి దట్టంగా పెరిగాయని, మద్య ఆసియా ప్రాంతం నుండి ఏటా వేలాది పక్షులు అతిధులుగా ఇక్కడికి తరలి వచ్చి ఈ ప్రాంతాన్ని ఆహ్లాధరింతం చేస్తున్నారు. సుమారు 3 కోట్ల నిధులతో రోడ్లు, పర్యాటక ఆకర్షణలను అభివృద్ది చేశామని, వలస పక్షుల సందడిని తిలకించేందుకు, మడ అడవుల ప్రాధాన్యతను తెలిపేందుకు ఈ యేడు తొలిసారిగా కోరింగ పక్షుల పండుగను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన విద్యార్థులను, పక్షి ప్రేమికులను మంత్రి అభినందిస్తూ, తిరిగి వెళ్లాక తమ అనుభవాలను, అనుభూతులను తోటి వారితోను, సామజిక మాధ్యమాల్లోను పంచుకుని కోరింగ పర్యాటక కేంద్రానికి మరింత ప్రాచుర్యం కల్పించాలని కోరారు. అలాగే కోరింగ పక్షి ఉత్సవాలను ఇకపై ఫ్లెమింగో ఫెస్టివల్ తరహాలో రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పక్షిని ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, వాటి సహజ ఆవాసాలైన చెట్లు, అడవులను కాపాడాలని మంత్రి చినరాజప్ప కోరారు.

అమలాపురం పార్లమెంట్ సభ్యులు డా.పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ పర్యావరణాన్ని, జీవావరణాన్ని మనిషి ధ్వసం చేస్తే తన గొయ్యి తాను త్రవ్వుకోవడమై అవుతుందని హెచ్చరించారు. కోరింగ మడ అడవులు జిల్లాకు లభించిన అపురూప సహజ సంపదని, వీటిని పరిరక్షించుకోవలసిన మనందరిపైనా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా మాట్లాడుతూ మడ అడవుల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు ఈ అంశాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. హోప్ ఐలాండ్, కోరింగ మడ అడవులను ఎకోటూరిజం ప్రోజెక్టుల ద్వారా అభివృద్ధి చేస్తున్నామని పక్షి ఉత్సవాలకు హాజరైన విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లుగా వీటికి ప్రాచుర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డా.శాంతి ప్రియా పాండే, తాళ్లరేవు ఏఎంసి చైర్మన్ మందాల గంగ సూర్యనారాయణ మడ అడవులు, పక్షుల పరిక్షణ ఆవశ్యకతను వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారిణి నందని సలారియా, వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ అనంత శంకర్, ఇగ్రీ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ తూపల్లి రవి శంకర్, జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, యంపిపి టేకుమూడి అనంత లక్ష్మి, కళాశాలు, పాఠశాలల విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)